క్లుప్తంగా

చెడు వ్యసనాలతో జీవితం నాశనం చేసుకోవద్దు



సీఐని సన్మానిస్తున్న కళాశాల నిర్వాహకులు

మెట్‌పల్లి: చెడు వ్యసనాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సీఐ నిరంజన్ రెడ్డి సూచించారు. పట్టణంలోని జ్ఞానోదయ కళాశాలలో మంగళవారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. చదువుకునే దశలో డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడితే సమాజంతో వారితో పాటు కుటుంబంపై కూడా తీవ్రమైన చెడు ప్రభావం పడుతోందన్నారు. అంతకు ముందు కళాశాల నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

జగిత్యాలక్రైం: పట్టణాలు, గ్రామాల్లో గంజాయి విక్రయిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం కండ్లపల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న జగిత్యాల పట్టణంలోని ఇస్లాంపురకు చెందిన సయ్యద్ అఫ్రోజ్‌ను పట్టుకుని 583 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి సేవించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విద్యుత్ అధికారుల విరాళం



విరాళం అందిస్తున్న ఎస్ఈ, అధికారులు

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు మంగళవారం రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియానాయక్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వృద్ధులకు తమవంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి నిరసన



నిరసన తెలుపుతున్న రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది

పెగడపల్లి: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, ఇతర ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం పెగడపల్లిలో రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. రెండు కార్యాలయాల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్యని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, డీటీ రాజశేఖర్, ఆర్ఐలు శ్రీనివాస్, జమున, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన 9 మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టులు భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థులు, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఆరోగ్య వైద్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ,దివ్యాంగులకు దరఖాస్తు రుసుము రూ.200, ఇతరులకు రూ.500 వైద్య శాఖ కార్యాలయంపై డీడీ తీసి ఈనెల 13 నుంచి 18 లోపు కార్యాలయంలో అందజేయాలన్నారు.

వారసంత... చింత..

- రోడ్డుపైనే నిర్వహణ
- వాహనాల రాకపోకలతో ఇబ్బందులు
- పట్టించుకోని మున్సిపల్, పోలీసు యంత్రాంగం



భారీ వాహనాలతో నిలిచిన రాకపోకలు



రాయికల్‌లో రోడ్డుపై నిర్వహిస్తున్న వారసంత

రాయికల్: పట్టణంలో ప్రతీ శనివారం నిర్వహించే వారసంత విస్తరిస్తోంది. గతంలో పాత బస్టాండ్ నుంచి ఇటిక్యాల క్రాసింగ్ రోడ్ వరకు ఉన్న వారసంత ప్రస్తుతం గాంధీచౌక్ వరకు రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్నారు. రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాలకు చెందిన ప్రజలు వారసంతకు వచ్చి కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారసంత శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల వరకు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతోంది.

రాకపోకలతో ఇబ్బందులు..

ప్రతీ శనివారం వారసంత నుంచే వాహనాలు, ఓవర్ స్పీడ్‌తో నడపడంతో వారసంతకు వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పోకిరీలు ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో పట్టణ ప్రజలు సైతం రాత్రుల పూట వారసంత సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. పట్టించుకోవాల్సిన మున్సిపల్, పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కూరగాయల వ్యాపారస్తులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా వారసంత రోజు జగిత్యాల నుంచి వచ్చే వాహనాలను శివాజీ విగ్రహం నుంచి గాంధీచౌక్ మీదుగా మళ్లించాలని దీంతో ట్రాఫిక్ సమస్య , ప్రజలు ఇబ్బందులు తీర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాహనాలను మళ్లించాలి



ప్రతీ శనివారం నిర్వహించే వారసంత రోజు వాహనాలను మున్సిపల్ అధికారులు మళ్లించే ప్రయత్నం చేయాలి. వారసంత నుంచే వాహనాలు వెళ్లడంతో ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– వాసం స్వామి, రాయికల్

సమస్య పరిష్కరిస్తాం



రాయికల్ పోలీసుల సహకారంతో వారసంత రోజున సంతలోకి వాహనాలను వెళ్లకుండా చూస్తాం. అవసరమైతే మున్సిపల్ సిబ్బందితో బారికేడ్లు ఏర్పాటు చేస్తాం. వారసంత నిర్వహణకు సమస్య లేకుండా చూస్తాం.

– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

ఏ దారి ఎటు వైపో...!



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో శివారులో ఆర్అండ్‌బీ రోడ్డు పరిధిలో వై జంక్షన్ వద్ద సూచిక బోర్డులు లేక వాహనదారులు పరేషాన్ అవుతున్నారు. ఏ రోడ్డు ఎటు వెళ్తుందో తెలియక ఇబ్బందిపడుతున్నారు. సూచికబోర్డులు లేక మెట్‌పల్లి వెళ్లేవారు చింతకుంట గ్రామం వైపు, చింతకుంటకు వెళ్లే వారు మెట్‌పల్లి వైపు వెళ్లి ఇక్కట్లపాలవుతున్నారు.అధికారులు చొరవ చూపి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్,ఏఈ ఆర్అండ్‌బీ,కథలాపూర్, సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



సమావేశంలో చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు

మల్యాల: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బత్తిని మల్లేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ జీవన్ రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో బుధవారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో రైతులకు అందుబాటులో ఉండి, సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో ముదాం మల్లేశం, కనకట్ల జలంధర్, యాల్ల స్వామి రెడ్డి, పాపిరెడ్డి, కొలకాని తిరుపతి, రామిడి శేఖర్ రెడ్డి, బర్ల లింగయ్య, సాగర్, కంబళ్ల రాయమల్లు, అసిస్టెంట్ సెక్రటరీ వరలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ధాన్యం తేమశాతం చూస్తున్న రఘువరన్

పెగడపల్లి: ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్డీవో రఘువరన్ నిర్వాహకులకు సూచించారు. పెగడపల్లి మండలంలోని అయితిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని ధాన్యం నిల్వలు, తేమశాతం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకంలో వేగం పెంచాలని తూకం చేసిన బస్తాలను వెంటనే సూచించిన మిల్లర్లకు చేరవేయాలన్నారు. తూకంలో రైతులను మోసగిస్తే నిర్వాహకులపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఏపీఎం సమత, నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యంలో తాలు, తప్ప లేకుండా చూసుకోవాలి

సారంగాపూర్: ధాన్యంలో తాలు, తప్ప లేకుండా రైతులు చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రదీప్ రెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో నాయికపుగూడెంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ధాన్యం ఆరబెట్టి, యంత్రాలపై శుభ్రం చేయాలని సూచించారు. కేంద్ర నిర్వాహకులు తూకం వేసిన వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈవో వెంకటేశ్, సింగిల్‌విండో ఉద్యోగుల భూమేష్, గంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. హరితహారంలో నాటిన చెట్లు పెదవై తరగతి గదుల్లో చీకటి పడుతోందని, చెట్లను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని పాఠశాల సిబ్బంది తహసీల్దార్‌ను కోరారు. చెట్లను కొట్టవద్దని, చెట్ల కొమ్మలను మాత్రమే కొట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మంచి రుచికరంగా వండాలని మళ్లీ వచ్చి భోజనం తనిఖీ చేస్తానని నిర్వాహకురాలు ప్రమీలకు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకు తల్లిదండ్రులు సహకరించాలి

మెట్‌పల్లి: ఇంటర్‌లో మెరుగైన ఫలితాల సాధన కోసం తల్లిదండ్రులు తమ వంతు సహకారమందించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు కోరారు. కళాశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల హాజరు, మార్కులపై దృష్టి సారించాలన్నారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నామని, దీనికి తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదాన శిబిరం

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీ సాయి నరసింహ హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైందని విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. ధర్మపురి పట్టణంలో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ధర్మపురి ప్రఖండ ఆధ్వర్యంలో మంగళవారం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి 36 యూనిట్ల రక్తాన్ని ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివరాములు, దుర్గాప్రసాద్, కస్తూరి రాజన్న, పూర్ణచందర్, మామిడాల రవీందర్, బుచ్చన్న పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెంది అరుణ అనే మహిళకు ఆపరేషన్ నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా, స్థానిక యువకులు ముంజ రాకేశ్, శివానంద్ మంగళవారం రక్తదానం చేశారు. మహిళకు రక్తం అవసరమని సమాచారం అందుకున్న యువకులు కోరుట్లలోని ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను గ్రామస్తులు, వైద్యులు అభినందించారు.

రైతు పాదయాత్ర ఫ్లెక్సీల తొలగింపు



కోరుట్ల: కోరుట్లలో ఎమ్మెల్యే సంజయ్ రైతు పాదయాత్ర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మున్సిపల్ నుంచి అనుమతులు లేవని, పాదయాత్ర ముందుకు సాగుతుండగా.. వెనుక నుంచే సిబ్బంది ఫ్లెక్సీలను తొలగిస్తూ వచ్చారు.

నృసింహుడిని దర్శించుకున్న 'అడ్లూరి'

ధర్మపురి: కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దేవస్థానం పక్షాన సాంప్రదాయ రీతుల్లో స్వాగతం పలికారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ

మెట్‌పల్లి: మెట్‌పల్లి డీఎస్పీగా రాములు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ములుగు జిల్లా డీసీఆర్‌బీలో పనిచేసిన రాములును మెట్‌పల్లి డీఎస్పీగా నియమిస్తూ ఇటీవలే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. గతంలో రాములు కోరుట్ల ఎస్సైగా పనిచేశారు.

'ఫ్లెక్సీలు తొలగించటం సరికాదు'

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ రైతు పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించటం సరికాదని జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు అన్నారు.ఫ్లెక్సీలకు అనుమతి లేదంటూ మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించటం తగదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏపార్టీ ఫ్లెక్సీలు తొలగించలేదన్నారు. ఫ్లెక్సీలను తొలగించటం కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే జరిగిందన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

'ఈ పాస్' తోనే ఎరువులు విక్రయించాలి

ఇబ్రహీంపట్నం: రైతులకు ఎరువులు, పురుగుల మందులు ఈ పాస్ యంత్రం ద్వారానే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ యంత్రం ద్వారా ఎరువుల నిల్వ, స్టాక్‌ను పరిశీలించారు. రాయితీ, చెల్లింపులు ఆన్‌లైన్ స్టాక్ ఆధారంగా మాత్రమే జరుగుతుందని ఎట్టి పరిస్థితిలోనూ ఎరువులను ఈ పాస్ ద్వారానే అమ్మకాలు జరపాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగుల మందులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను రైతులకు విక్రయించాలన్నారు. రైతులు లైసెన్స్ గల దుకాణాలలో మాత్రమే ఎరువులను కొనుగోలు చేసి రశీదును తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వినోద్, సీఈవో సతీశ్, ఎరువుల దుకాణాల యాజమానులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కార్తీక పూజలు



ఆలయంలో మహిళల ప్రత్యేక పూజలు

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయంలో కార్తిక మాసోత్సవం సందర్భంగా వైభవంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు గుండి వినయ్‌శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం రాత్రి రుద్రాభిషేకం అనంతరం సభ్యులు చేసిన శత లలిత పారాయణం ఆకట్టుకుంది.

సమగ్ర సర్వే సమర్థవంతంగా చేపట్టాలి



పొరండ్లలో సర్వేను పరిశీలిస్తున్న నరేశ్

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ నరేశ్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు, ప్రభుత్వం సూచించిన దాని ప్రకారం ప్రతి విషయాన్ని సర్వేలో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరీటి, కారోబార్ రాజిరెడ్డి, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలో ఇంటింటా కులగణన సర్వేను మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్ మంగళవారం పరిశీలించారు. ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్న ఇళ్ల వద్దకు వెళ్లి ఏ విధంగా వివరాలు నమోదు చేస్తున్నారనే విషయంలో పరిశీలించారు. ప్రజలు వివరాలు సక్రమంగా తెలియజేసి అధికారులకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్ ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో అధికారులు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, అంగన్‌వాడీ టీచర్లు సర్వేలో పాల్గొంటున్నారు. ప్రత్యేకాధికారులు సుజాత, దేవప్రసాద్, ఎంపీడీవోలు గంగాధర్, లచ్చాలు, ఎంపీవో శశికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులపై ఒత్తిడి సరికాదు'

జగిత్యాల: సమగ్ర కుటుంబ సర్వే విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను టార్గెట్ పేరుతో ఒత్తిడి చేయడం సరికాదని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి దేవయ్య, ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు సర్వే పేరుతో విధులు కేటాయించి ఒక్క పూట మాత్రమే నడపడం వల్ల తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి వస్తుందన్నారు. రోజుకు 20–25 కుటుంబాలు సర్వే చేయాలని ఒత్తిడి చేయడం తగదన్నారు.

బుగ్గారం: రాష్ట్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే గడువును పెంచాలని,ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.సర్వేలో భాగంగా రోజుకు 6 నుండి 8 ఇండ్లు మాత్రమే సర్వే చేసేలా అనుమతి ఇవ్వాలనీ,150 ఇండ్లు దాటిన ఎన్యుమరేటర్లకు అదనంగా ఇంకో ఉపాధ్యాయుడిని ఎన్యుమరేటర్‌గా నియమించాలని కోరారు.

సర్వే టార్గెట్ పెట్టొద్దు

సారంగాపూర్: సమగ్ర కుటుంబ సర్వే చేస్తున్న ఉపాధ్యాయులకు రోజు 20 నుంచి 25 కుటుంబాలను సర్వే చేయాలని టార్గెట్‌లు పెట్టడం సరికాదని టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో సంఘం నేతలు మాట్లాడుతూ కొత్తగా ఉపాధ్యాయులుగా చేరిన వారిని రోజూ 25 కుటుంబాలను సర్వే చేయాలనడం ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.

మాలల మహాపాదయాత్ర విజయవంతం చేయాలి

వెల్గటూర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన మహాపాదయాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాదయాత్ర పోస్టర్‌ను వెల్గటూర్ మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 15న రాయపట్నం మీదుగా జగిత్యాల వరకు జరిగే ఈ పాదయాత్రలో ధర్మపురి నియోజకవర్గం నుంచి మాల సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పొనగంటి రాజన్న, కార్యదర్శి సుమన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పులి లక్ష్మణ్, కార్యదర్శి కిరణ్, మండల ఉపాధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో 9 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో రూ.2,76,500 విలువ గల చెక్కులు మంజూరు కాగా, మంగళవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, జలేందర్‌రెడ్డి, కుంట గంగారెడ్డి, కాటిపల్లి గంగారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని కలిగోట, కథలాపూర్ గ్రామాల్లో ముగ్గురికి సీఎమ్మార్ఎఫ్ చెక్కులను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కథలాపూర్‌కు చెందిన నల్ల గంగాధర్‌కు రూ. 22,500, కలిగోట గ్రామానికి చెందిన గంగారెడ్డికి రూ. 40 వేలు, రాజారెడ్డికి రూ. 45 వేలు చెక్కులను అందించారు. సీఎమ్మార్ఎఫ్ మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు న్యావనంది శేఖర్, కల్లెడ గంగాధర్, తిపిరెడ్డి అనంతరెడ్డి, మోహన్‌రెడ్డి, అంజన్న, రాధకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

20న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



మెట్‌పల్లి: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 20 వ తేదీన పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముత్తయ్యరెడ్డి తెలిపారు. అండర్ -8,10,12 విభాగాల్లో బాలబాలికలకు రన్నింగ్, లాంగ్ జంప్,షాట్‌పుట్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 18 లోపు తమ వివరాలను అందించాలన్నారు.